సాక్షి
అనంతపురం
గురువారం । 26 । జూన్ । 2025



అనంతలో హత్యల కలకలం

ప్రశాంతంగా ఉన్న అనంతపురం నగరంలో హత్యల కలకలం రేగింది. నగర వాసులు బెంబేలెత్తుతున్నారు.

8లో



ప్రజా వ్యతిరేక దిశగా కూటమి

కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందని సీపీఎం రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీ పి. మధు విమర్శించారు.

8లో

గరిష్ఠం/కనిష్ఠం
32.1°/22.4°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

'నైపర్'లో సత్తా



ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న ఓటీపీఆర్‌ఐ డైరెక్టర్ సుబ్బారెడ్డి

అనంతపురం: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నైపర్) జేఈఈ-2025 ప్రవేశ పరీక్షల్లో జేఎన్‌టీయూ (ఏ) ఓటీపీఆర్‌ఐ విద్యార్థులు సత్తా చాటారు. అఖిల భారత స్థాయిలో ర్యాంకులు సాధించారు. కే. గురు చరణ్ 793 ర్యాంకు, డి. హేమంత్ కుమార్ 1,561, జి. దేవీ ప్రియ 2,187, ఎస్. కుష్వంత్ 3,205, బి. ఆర్తి 3,527, కే. సాయి కిరణ్ 5,124, కె. హేమంత్ 5,254 ర్యాంకులతో మెరిశారు. ఈ సందర్భంగా ఓటీపీఆర్‌ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీ సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సి. గోపీనాథ్ ఆయా విద్యార్థులను బుధవారం అభినందించారు.

ఆర్‌ఎస్‌కే సిబ్బంది బదిలీలకు గ్రీన్‌సిగ్నల్



అనంతపురం సెంట్రల్: రైతు సేవా కేంద్రాల (ఆర్‌ఎస్‌కే) సిబ్బంది బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఐదేళ్ల సర్వీసు పూర్తయిన వారికి ఆఫ్‌లైన్‌లో,ఐదేళ్లలోపు సిబ్బంది రిక్వెస్ట్ బదిలీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. రిక్వెస్ట్ బదిలీ ఉద్యోగులకు వారి సొంత మండలంలో కాకుండా ఇతర మండలాల్లో పోస్టింగ్ కల్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నెలాఖరులోపు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో కౌన్సెలింగ్ తేదీలు ఖరారు చేసే పనిలో ఆయా శాఖల అధికారులు నిమగ్నమయ్యారు. ఉమ్మడి జిల్లాలో 867 రైతు సేవా కేంద్రాలున్నాయి. అనంతపురం జిల్లాలో 126 మంది, శ్రీ సత్యసాయి జిల్లాలో 124 మంది విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు పని చేస్తున్నారు. వీరిలో ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారు 'అనంత'లో 101 మంది, 'శ్రీ సత్యసాయి'లో 102 మంది ఉన్నారు. హార్టికల్చర్ అసిస్టెంట్లు 'అనంత'లో 180 మంది,'శ్రీ సత్యసాయి'లో 143 మంది ఉండగా అందరికీ ఐదేళ్లు పూర్తయ్యాయి. ఇక.. ఐదేళ్లు పూర్తి చేసుకున్న సెరికల్చర్ అసిస్టెంట్లు 'అనంత'లో 12 మంది, 'శ్రీ సత్యసాయి'లో 73 మంది ఉన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పశు సంవర్ధక శాఖకు సంబంధించి 666 మంది వెటర్నరీ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు.

గ్రామాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం సిటీ: గ్రామీణాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహిళా సర్పంచులకు అనంతపురం జిల్లా పరిషత్ క్యాంపస్‌లో గల డీపీఆర్‌సీ భవన్‌లో మూడ్రోజులుగా నిర్వహించిన డివిజనల్ స్థాయి శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ముగింపు సభకు జెడ్పీ సీఈఓ శివశంకర్ అధ్యక్షత వహించగా, చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో పంచాయతీరాజ్ వ్యవస్థ ఒక ప్రధాన భాగమన్నారు. ఇలాంటి తరుణంలో కేవలం ఎన్నికల ద్వారా ప్రజాప్రతినిధులుగా ఎన్నికైనంత మాత్రాన లక్ష్యం నెరవేరదన్నారు. పాలనలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొని, సమర్థవంతమైన నాయకత్వ లక్షణాలు అందిపుచ్చుకున్నప్పుడే రాజకీయాల్లో రాణించగలరన్నారు. ఇందుకు సరైన పరిజ్ఞానం, నైపుణ్యం, ఆత్మ విశ్వాసం అవసరమని పేర్కొన్నారు. మహిళా సర్పంచులు తమ హక్కులు, బాధ్యతలు తెలుసుకొని, గ్రామాభివృద్ధి ప్రణాళిక రూపకల్పనపై అవగాహన పెంచుకోగలిగితే పాలనా రంగంలోనూ మహిళలు తీసిపోరని నిరూపించినట్లు అవుతుందన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళా సర్పంచులకు డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య అభినందనలు తెలిపారు. అనంతరం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

లక్షణంగా వెనక్కి!



- కలగానే బీఎస్ఎన్ఎల్ పూర్వవైభవం
- అందివచ్చిన అవకాశాన్ని వినియోగించుకోలేని సంస్థ
- పెరిగిన కస్టమర్లను నిలుపుకోలేని వైనం
- అనంతపురం జోన్‌లో లక్ష మందికి పైగా సర్వీసు నుంచి బయటకు

❒ అనంతపురానికి చెందిన మురళీమోహన్‌రెడ్డి 20 ఏళ్లుగా బీఎస్ఎన్ఎల్ నంబర్ వాడుతున్నారు. సిగ్నల్ సమస్య వచ్చినా, నెట్‌వర్క్ సరిగా రాకపోయినా మరో నెట్‌వర్క్‌లోకి మారేందుకు ఇష్టపడలేదు. కానీ రానురాను సమస్య మరీ తీవ్రంగా మారింది. ఇన్‌కమింగ్ కాల్స్ కూడా రావడం లేదు. పైగా మిత్రులంతా ఎందుకని ఎప్పుడూ సెల్ స్విచాఫ్ చేసుకుని ఉంటావంటూ ప్రశ్నించడం మొదలు పెట్టారు. దీంతో మురళీమోహన్‌రెడ్డి కస్టమర్ కేర్‌కు ఫిర్యాదు చేశారు. ఫలితం లేదు. బీఎస్ఎన్ఎల్ కార్యాలయానికి వెళ్లి సమస్య వివరించినా ఫలితం లేకపోవడంతో ఇటీవల మరోనెట్‌వర్క్‌కు మారిపోయాడు.

❒ పుట్టపర్తికి చెందిన శ్రీరామ్ ఓ ప్రైవేటు సంస్థలో పనిచేసేవాడు. సదరు సంస్థ 'సీయూజీ' సిమ్ ఇవ్వడంతో ఆ నంబర్ వాడేవాడు. కానీ మూడేళ్ల క్రితం ఆయన ఆ సంస్థ నుంచి బయటకు వచ్చాడు. కానీ ఆ నంబర్‌ను వదులుకోలేక పోయాడు. సంస్థను అభ్యర్థించి ఆ నంబర్ మరో నెట్‌వర్క్‌లో ఉంటే పోర్టబులిటీ ద్వారా బీఎస్ఎన్ఎల్‌కు మారాడు. అప్పటి నుంచి అతనికి సమస్యలు మొదలయ్యాయి. సిగ్నల్ సరిగా లేక డాటా కూడా ఉపయోగించలేని పరిస్థితి నెలకొంది. ఎవరికి ఫిర్యాదు చేసినా సేవలు మెరుగుపడకపోవడంతో ఇటీవలే మరో నెట్‌వర్క్‌లోకి మారిపోయాడు.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అవకాశాలు రాక.. వ్యాపారాలు లేక చాలా దిగ్గజ సంస్థలన్నీ నిరాశగా ఉండగా బీఎస్ఎన్ఎల్ మాత్రం అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేక పోయింది. ఒక దశలో లక్షలాది మంది కస్టమర్లు బీఎస్ఎన్ఎల్ కావాలని సిమ్‌లు తీసుకుంటే వారికి సర్వీసు ఇవ్వలేక చతికిల పడింది. సిగ్నల్స్ ఉండవు, ఫిర్యాదు చేస్తే పట్టించుకోరు, నెట్ సరిగా రాకపోవడంతో సిమ్‌కార్డు ఎందుకు తీసుకున్నాం రా బాబూ అంటూ వినియోగదారులు గగ్గోలు పెట్టిన పరిస్థితి. అనంతపురం, వైఎస్సార్ కడప జిల్లాల పరిధిలో ఎంతో ఆశగా బీఎస్ఎన్ఎల్ సిమ్‌లు తీసుకున్న సంతోషం నాలుగు నెలల్లోనే ఆవిరి అయిపోయింది.

టారిఫ్‌లు పెంచడంతో..

కొన్ని నెలల క్రితం జియో, ఎయిర్‌టెల్ వంటి ప్రైవేటు మొబైల్‌సర్వీస్ ప్రొవైడర్లు ఒక్కసారిగా నెలవారీ చార్జీలు పెంచాయి. దీంతో అనంతపురం జోన్ (కడప-అనంతపురం) పరిధిలో సుమారు 1.85 లక్షల మంది కస్టమర్లు బీఎస్ఎన్ఎల్ వైపు మొగ్గు చూపారు. దీంతో బీఎస్ఎన్ఎల్‌కు పూర్వవైభవం వచ్చినట్టయింది. కానీ కస్టమర్ల సంతోషం ఎక్కువ రోజులు నిలవలేదు. సిమ్‌కార్డు తీసుకున్న వారంలోనే కష్టాలు మొదలయ్యాయి. మొబైల్‌కు సిగ్నల్స్ రాకపోవడం, నెట్‌సరిగా ఉండకపోవడం, సమస్యలు పరిష్కారం కాకపోవడంతో విసుగెత్తిపోయారు. పైగా సిబ్బందికి మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకపోవడంతో కస్టమర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఇంకా 4జీనే..

అనంతపురం, వైఎస్సార్ కడప జిల్లాలను ఒక జోన్‌గా పరిగణిస్తారు. ఇటీవల ఈ జోన్‌లో సుమారు 1.85 లక్షల మంది బీఎస్ఎన్ఎల్‌కు మారారు. దీంతో భారీగా బిజినెస్ పెరిగింది. సిమ్‌లు విచ్చలవిడిగా అమ్ముడయ్యాయి. కోట్ల రూపాయల లావాదేవీలు జరిగాయి. కానీ నెల రోజుల్లోనే నెట్‌వర్క్ సరిగా పనిచేయలేదు. కాస్త రూరల్‌కు వెళితే సిగ్నల్స్ లేవు. పైగా ప్రైవేటు సర్వీసు ప్రొవైడర్లు 6జీకి వెళుతుంటే బీఎస్ఎన్ఎల్‌లో 4జీనే సరిగా రాదు. దీంతో కస్టమర్లలో సుమారు 1.39 లక్షల మంది వెనక్కు వెళ్లిపోయారు. టవర్లు తక్కువగా ఉండటం, సర్వీసులను ఉన్నతీకరించక పోవడం కారణంగా తీవ్ర ఇబ్బందులు పడి వెనక్కు వెళ్లినట్టు తెలుస్తోంది.

ప్రైవేటు ప్రొవైడర్లు చార్జీలు పెంచడంతో బీఎస్ఎన్ఎల్‌కు వచ్చిన వారు

అనంతపురం	1,05,000 పైగా
వైఎస్సార్ కడప	80,000 పైగా
అనంతపురం జిల్లాలో టవర్లు	450 వరకూ
వైఎస్సార్ కడప జిల్లాలో టవర్లు	350 వరకూ

సేవలు సరిగా లేక బీఎస్ఎన్ఎల్ నుంచి తిరిగి వెనక్కు వెళ్లిన వారు

1,39,000

ప్రస్తుతం రెండు జిల్లాల్లో బీఎస్ఎన్ఎల్ కస్టమర్లు

6,00,000

30 వరకే సబ్‌డివిజన్ డ్రైవ్



మాట్లాడుతున్న జేసీ శివ్ నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: 'భూములు రీ-సర్వే జరిగిన గ్రామాల్లో ప్రత్యేక సబ్ డివిజన్ డ్రైవ్ ఈనెల 30 వరకే ఉంటుంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకునేలా సమాచారం చేరవేయండి' అని అధికారులను జేసీ శివ్ నారాయణ్ శర్మ ఆదేశించారు. సబ్ డివిజన్ డ్రైవ్ అంశంపై జేసీ బుధవారం కలెక్టరేట్ నుంచి డివిజన్, మండలస్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జాయింట్ పట్టాదారులుగా నమోదైన రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడంలో నెలకొన్న ఇబ్బందులు తొలగించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక సబ్ డివిజన్ డ్రైవర్ చేపట్టామన్నారు. రెవెన్యూశాఖ సబ్ డివిజన్ సేవకు నిర్ధారించిన రుసుము రూ.550లో రూ.500 మినహాయింపు ఇచ్చారన్నారు. నామమాత్రంగా దరఖాస్తు రుసుం రూ.50 సంబంధిత గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ వద్ద చెల్లించాలన్నారు. తదుపరి జాయింట్ పట్టాదారులకు ఉచితంగా సబ్‌డివిజన్ చేస్తారన్నారు. ఈ అవకాశం ఈనెల 30 తేదీలోపు దరఖాస్తు చేసుకున్నవారికే ఉంటుందన్నారు. రీ-సర్వే జరిగిన గ్రామాల్లో రైతులకు ఈ విషయాన్ని తెలియజేసి సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సర్వే శాఖ ఏడీ రూప్లానాయక్ పాల్గొన్నారు.

ఏఈఓలకు ఇన్‌చార్జ్ ఏఓ బాధ్యతలు

అనంతపురం సెంట్రల్: వ్యవసాయశాఖలో పలువురు ఏఈఓలకు మండల ఏఓలుగా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ ఉత్తర్వులు జారీ చేశారు. డీ హీరేహాళ్ ఏఈఓ ఎస్.వి.గోపాల్‌కు బ్రహ్మసముద్రం ఏఓగా, కళ్యాణదుర్గం ఏఈఓ విజయకుమార్‌కు కుందుర్పి, గుత్తి ఏఈఓ మధుకర్‌కు ఉరవకొండ, తాడిపత్రి ఏఈఓ మధుకుమార్‌కు యల్లనూరు మండల వ్యవసాయాధికారిగా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. అలాగే క్వాలిటీ కంట్రోల్ కళ్యాణదుర్గం ఏఓగా శ్రావణ్‌కుమార్, కంబదూరు ఏఓగా మహేష్, గుంతకల్లు ఏఓగా లీనావసుందర, పుట్లూరు ఏఓగా కాత్యాయిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.







బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట రామిరెడ్డి, సమన్వయకర్తలు రంగయ్య (కళ్యాణదుర్గం), మెట్టు గోవిందరెడ్డి (రాయదుర్గం), కేతిరెడ్డి పెద్దారెడ్డి (తాడిపత్రి), విశ్వ (ఉరవకొండ), శైలజనాథ్ (శింగనమల), ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

అనుకున్నట్టే చేశారు!

- 2008, 1998 ఎంటీఎస్ టీచర్లకు వేర్వేరుగా బదిలీల కౌన్సెలింగ్
- బెదిరించే ధోరణితో ముందుకెళ్లిన అధికారులు
- ఎట్టకేలకు 2008 ఎంటీఎస్ టీచర్లకు కౌన్సెలింగ్ పూర్తి



కౌన్సెలింగ్ కేంద్రంలో ఎంటీఎస్ టీచర్లు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఈఓ ప్రసాద్ బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇప్పటికే రెండుమార్లు వాయిదా పడ్డ ఎంటీఎస్ టీచర్ల బదిలీల అంశంలో అధికారులు కొత్త పంథా ఎంచుకుని అనుకున్నట్టే చేశారు. సీనియార్టీ జాబితాలో 2008 ఎంటీఎస్ టీచర్లు ముందున్నారు. వీరి తర్వాతనే 1998 ఎంటీఎస్ టీచర్లు మొదలవుతారు. ఖాళీలన్నీ దూర ప్రాంతాల్లో ఉండడం, ఉన్న వాటిలో 2008 ఎంటీఎస్ టీచర్లకు కాస్తా మంచివి దక్కుతాయి. రెండుసార్లు వాయిదా పడడంలో 1998 ఎంటీఎస్ టీచర్ల పాత్ర ఎక్కువగా ఉందని నిర్ణయానికి వచ్చిన విద్యాశాఖ... ఎంటీఎస్ టీచర్ల మధ్య 'విభజించు-పాలించు' సూత్రాన్ని అమలు చేసింది. 2008, 1998 వారిని కలిపికాకుండా వేర్వేరుగా కౌన్సెలింగ్ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో డీఈఓ పేరుతో మెసేజ్ పంపారు. '2008 ఎంటీఎస్ టీచర్లకు మాత్రమే సాయంత్రం 5 గంటలకు కౌన్సెలింగ్' ఉంటుందని పేర్కొన్నారు.

గొడవతో ఉద్రిక్తత..

సాయంత్రం 5 గంటలకు 2008 ఎంటీఎస్ టీచర్లం దరూ వచ్చారు. జాబితాలో 50 మందికి మాత్రమే మంచి స్కూళ్లు వస్తాయి. తక్కిన 147 మంది దూర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుందని వాపోయారు. ఇలా రెండు గ్రూపులు విడిపోయి వాదించుకున్నారు. ఇదే సమయంలో 'కౌన్సెలింగ్‌కు హాజరుకాకపోతే నేరుగా కమిషనరేట్ నుంచి ఉత్తర్వులు జనరేట్ అవుతాయి.. ఎవరికి ఎక్కడొస్తాయో మీ ఇష్టం' అంటై విద్యాశాఖ సిబ్బంది బెదిరింపులకు గురి చేయడంతో ఎంటీఎస్ టీచర్లు ఇరకాటంలో పడ్డారు. జాబితాలో ముందున్న కొందరు తాము కౌన్సెలింగ్‌లో పాల్గొంటామని చెప్పడంతో మరికొందరు అడ్డుకున్నారు. దీంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. ఎట్టకేలకు రాత్రి 7 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభమైంది. డీఈఓ ఎం. ప్రసాద్ బాబు పర్యవేక్షణలో ప్రక్రియ సాగింది. ఇక.. నేడో, రేపో 1998 ఎంటీఎస్ టీచర్లకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. కమిషనరేట్ నుంచి ఆదేశాలు రాగానే 1998 ఎంటీఎస్ టీచర్లకు సమాచారం చేరవేస్తామని డీఈఓ వెల్లడించారు.

చెత్త హామీతో ప్రజల చిత్తు

- 'అనంత'లో అటకెక్కిన కంపోస్టు యార్డు తరలింపు
- అధికారంలోకి వస్తే చర్యలు తీసుకుంటామని 'తమ్ముళ్ల' ప్రగల్భాలు
- ఏడాది పూర్తయినా పట్టించుకోని వైనం
- స్థానికులు, వాహనదారులకు తీవ్ర అవస్థలు





అనంతపురం-గుత్తి రోడ్డులో ఉన్న కంపోస్టు యార్డు నుంచి వెలువడుతున్న పొగ, జాతీయ రహదారిపై పొగలో వాహనదారుల ఇబ్బందులు

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక అనంతపురంలో కంపోస్టు యార్డు తరలిస్తామని 'తెలుగు తమ్ముళ్లు' ప్రగల్భాలు పలికారు. అయితే, అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా నేడు ఆ ఊసే ఎత్తడం లేదు. దీనికి తోడు చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక ఇంత వరకు కంపోస్టు యార్డులో చెత్త నిర్వహణ జరగలేదు. రోజురోజుకూ చెత్త గుట్టలు గుట్టలుగా చేరుతోంది. కంపోస్టు యార్డులో దాదాపు 2 లక్షల టన్నులకుపైగా చెత్త ఉంది. నగరంలోని 50 డివిజన్లకు సంబంధించి 74 సచివాలయాల పరిధిలో రోజూ 120 టన్నుల నుంచి 140 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. అందులో 12 నుంచి 18 టన్నులు ప్లాస్టిక్ ఉంటోంది. ఈ క్రమంలో చెత్త నిర్వహణ పక్కాగా చేపట్టేలా చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రత్యక్ష నరకం..

కంపోస్టు యార్డు ఉండే గుత్తి రోడ్డు, ఆ చుట్టుపక్కల ప్రాంతాలైన లెక్చరర్స్ కాలనీ, రాజీవ్ కాలనీ వాసులతో పాటు ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. ఈదురుగాలులు వచ్చాయంటే భారీ మంటలు చెలరేగి దట్టమైన పొగ వస్తోంది. ఈ క్రమంలో పొగలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుత్తి రోడ్డు మార్గంలో ప్రయాణమంటేనే వాహనదారులు హడలెత్తిపోతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనకు లోనవుతున్నారు. ఇక.. కంపోస్టు యార్డు నుంచి వచ్చే దుర్వాసన భరించలేక అక్కడి ప్రజలు నిత్యం తలుపులు, కిటికీలు మూసుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

కలెక్టర్ దృష్టి సారిస్తేనే..

కంపోస్టు యార్డులో చెత్త నిర్వహణపై జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. సాధ్యమైనంత త్వరగా ప్రక్రియను ప్రారంభించి, పనికిరాని చెత్త, ప్లాస్టిక్‌ను అల్ట్రాటెక్, తదితర కంపెనీలకు పంపిస్తే ప్రయోజనకరంగా ఉంటుంది. నిషేధిత ప్లాస్టిక్ కూడా టన్నుల కొద్దీ కంపోస్టు యార్డులో పేరుకుపోయింది. ఈ క్రమంలో ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే విష వాయువులు వెలువడి ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు. ఇప్పటికైనా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ స్పందించి కంపోస్టు యార్డును పరిశీలించి తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతే లక్ష్యం



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాస్థాయి ఎస్సీ, ఎస్టీ కాంపొనెంట్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పథకంలో 17.08 శాతం ఎస్సీలకు, 5.53 శాతం ఎస్టీలకు లబ్ధి చేకూర్చాలని ఆదేశించారు. లక్ష్యాలను నిర్దేశించుకుని వందశాతం అమలు చేయాలని చెప్పారు. 'ఉన్నతి' పథకం కింద స్త్రీ నిధి ద్వారా మహిళలకు రుణాలు అందించాలన్నారు. 'జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్' అమలులో దేశంలోనే జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని సూచించారు. పీఎంఈజీపీ రుణాలకు సంబంధించి యూనియన్ బ్యాంక్ పరిధిలో సక్రమంగా మంజూరు కావడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయని, తగిన చర్యలు తీసుకోవాలని డీఐసీ జీఎంను ఆదేశించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ కిట్‌లను లబ్దిదారులకు అందించాలన్నారు. సమావేశంలో డీటీడబ్ల్యూఓ రామాంజనేయులు, జెడ్పీ సీఈఓ శివశంకర్, సీపీఓ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రతిభ కనబరిస్తే తల్ సైనిక్ క్యాంపునకు ఎంపిక

- ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ కల్నల్ ఎల్‌డీ రాడ్రిక్స్



క్యాడెట్లనుద్దేశించి ప్రసంగిస్తున్న కల్నల్ ఎల్‌డీ రాడ్రిక్స్

కూడేరు: పది రోజుల పాటు కొనసాగే ఎన్‌సీసీ శిక్షణా తరగతుల్లో ప్రతిభ కనబరిస్తే ఢిల్లీలో జరిగే తల్ సైనిక్ క్యాంపునకు ఎంపికవుతారని ఎన్‌సీసీ క్యాడెట్లకు క్యాంప్ కమాండర్ కల్నల్ ఎల్‌డీ రాడ్రిక్స్ సూచించారు. కూడేరు మండలం బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో సీఏటీసీ–5 ఎన్‌సీసీ క్యాడెట్ల శిక్షణా తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల నుంచి 500 మంది క్యాడెట్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో క్యాంప్ కమాండర్ ఎల్‌డీ రాడ్రిక్స్ మాట్లాడారు. ఎన్‌సీసీ శిక్షణ మంచి భవిష్యత్తును ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు శారద, సంగీత శశికళ, ఇంద్ర బహదూర్, నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో కుప్పకూలి వ్యక్తి మృతి



మృతుడు చంద్రశేఖరరెడ్డి

గుత్తి: స్థానిక రైల్వే స్టేషన్‌లో చంద్రశేఖర రెడ్డి (51) అనే వ్యక్తి కుప్పకూలి మృతి చెందాడు. బుధవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. పామిడి మండలం రామరాజుపల్లికి చెందిన చంద్రశేఖరరెడ్డి ఇటీవల తిరుపతి వెళ్లారు. బుధవారం తిరిగి వచ్చిన ఆయన గుత్తి రైల్వే స్టేషన్‌లో రైలు దిగాడు. స్టేషన్‌లో బయటకు వెళ్లడానికి మెట్లు ఎక్కుతున్న సమయంలో కుప్పకూలి కింద పడి మృతి చెందాడు. గుండె పోటుతో మృతి చెందినట్లుగా జీఆర్పీ ఎస్ఐ నాగప్ప తెలిపారు.

ఉత్తమ బాడీ బిల్డర్‌గా హేమంత్



బంగారు పతకాన్ని అందుకుంటున్న హేమంత్

బుక్కరాయసముద్రం: బెంగళూరు వేదికగా ఐసీఎన్ ఇండియా ఇటీవల నిర్వహించిన బాడీ బిల్డర్, ఫిట్నెస్ మోడలింగ్ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో బీకేఎస్ మండలం రేకులకుంట గ్రామానికి చెందిన ఆకుల నాగభూషణ కుమారుడు హేమంత్ బంగారు పతకాన్ని దక్కించుకున్నాడు. వివిధ దేశాలకు చెందిన అథ్లెట్లు, బాడీ బిల్డర్లు, ఫిట్‌నెస్ మోడల్స్ తలపడిన ఈ పోటీల్లో ప్రామాణిత డ్రగ్ టెస్టింగ్ ద్వారా పరీక్షలు నిర్వహించారు.

మద్యం రాసిన మరణ శాసనం

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సమయపాలనలేని మద్యం విక్రయాలు
- మద్యానికి బానిసవుతున్న యువత
- తాగుడు మానేయమంటే ఆత్మహత్యలే

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మద్యం విక్రయాలను ఆదాయ వనరుగా సీఎం చంద్రబాబు మార్చేశారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మద్యం షాపుల నిర్వహణను దక్కించుకున్న 'పచ్చ' నేతలు నిబంధనలు తుంగలో తొక్కి వేళాపాళా లేకుండా విక్రయాలు చేపడుతున్నారు. దీంతో యువత మత్తులో జోగుతోంది. తాగుడు మానేయమని ఇంట్లో వారు ఒత్తిడి చేస్తే మందుబాబులు ఆత్మహత్యలకు వెనుకాడడం లేదు. ఇలాంటి ఘటనలు తరచూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వెలుగు చూస్తున్నాయి. గత వైఎస్సార్‌సీపీ హయాంలో ఈ పరిస్థితి లేదని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎక్కడ పడితే అక్కడ మద్యం విక్రయాలు సాగిస్తుండడంతో తమ పిల్లలు మత్తుకు బానిసలవుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది మద్యం రాసిన మరణ శాసనం. ఈ శాసనానికి బుధవారం ఇద్దరు యువకులు బలయ్యారు.



ధర్మవరం అర్బన్: మద్యం తాగొద్దని భార్య చెప్పినందుకు మనస్తాపంతో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బుధవారం శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని మార్కెట్‌వీధిలో జరిగింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు... మార్కెట్‌వీధికి చెందిన డ్రైవర్ రాజేంద్రప్రసాద్(30)కు భార్య చంద్రకళ, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. రోజూ మద్యం తాగి ఇంటికి వస్తుండేవాడు. తాగుడు మానేయాలని భార్య బతిమాలినా వినేవాడు కాదు. మద్యం మానేయమంటే తాను చనిపోతానంటూ తరచూ బెదిరించేవాడు. ఈ క్రమంలోనే మంగళవారం ఇంట్లో ఉన్న రూ.200 నగదు తీసుకుని మద్యం తాగి రాత్రి ఇంటికి తిరిగొచ్చాడు. ఈ విషయంపై భార్య ప్రశ్నించడంతో ఏదో ఒకటి చేసుకుని చనిపోతానంటూ బెదిరించి.. తన ఇద్దరు పిల్లలతో కలిసి ఇంటి హాల్లో నిద్రించాడు. రోజూ బెదిరించేది మామూలే కదా అనుకుని ఆమె కూడా పిల్లల పక్కన పడుకుని నిద్రపోయింది. బుధవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో భార్యకు మెలకువ వచ్చి చూడగా హాల్లో నిద్రపోతున్న భర్త కనిపించలేదు. వంట గదిలోకి వెళ్లి చూడగా ఫ్యాన్ హుక్కుకు బెడ్‌షీట్‌తో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న దృశ్యం కనిపించింది. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



రాజేంద్రప్రసాద్(ఫైల్)

- **గుమ్మఘట్ట:** తాగుడు మానేయమన్నందుకు ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతపురం జిల్లా గుమ్మఘట్ట మండలం పైదొడ్డి గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రాజన్న, లక్ష్మక్క దంపతులకు నలుగురు కుమారులు కాగా, వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకునేవారు. కుమారుల్లో చివరి వాడైన శశికుమార్ (28)కు పెళ్లి కాలేదు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. తాగుడు మానేయాలని కుటుంబసభ్యులు ఎంత చెప్పినా వినేవాడు కాదు. ఈ నేపథ్యంలో మంగళవారం మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న కుమారుడికి తల్లిదండ్రులు మరోసారి నచ్చచెప్పారు. తాగుడు మానేస్తే ఎవరైనా పిల్లనిచ్చేందుకు ముందుకు వస్తారని ఇప్పటికైనా మద్యం సేవించడం మానేయాలని హితవు పలికారు. దీంతో మనస్తాపం చెందిన శశికుమార్ బుధవారం ఉదయం కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లగానే ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్యాహ్నం ఇంటికి చేరుకున్న కుటుంబసభ్యులు విషయాన్ని గుర్తించి బోరున విలపించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



శశికుమార్ (ఫైల్)

రైల్వే అభివృద్ధికి పాటుపడదాం : డీఆర్ఎం



టీటీఈ వెంకటయ్యకు అవార్డు అందజేస్తున్న డీఆర్ఎం చంద్రశేఖర్‌గుప్తా

గుంతకల్లు: అంకిత భావంతో విధులు నిర్వర్తిస్తూ రైల్వే అభివృద్ధికి పాటుపడదామని ఉద్యోగులకు డీఆర్ఎం చంద్రశేఖర్‌గుప్తా పిలుపునిచ్చారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన టీటీఈలకు మ్యాన్ ఆఫ్ మంత్ అవార్డుల పంపిణీ కార్యక్రమం బుధవారం సాయంత్రం డీఆర్ఎం కార్యాలయంలో జరిగింది. టిక్కెట్ చెకింగ్ స్క్వాడ్ గత నెలలో నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసుకున్న దాదాపు 14 మందికి అవార్డులను డీఆర్ఎం అందజేసి, అభినందించారు. ఏడీఆర్ఎం సుధాకర్, సీనియర్ డీసీయం మనోజ్, కమర్షియల్ బ్రాంచ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం తరలింపుదారుడి అరెస్ట్

రాయదుర్గం: జిల్లాలోకి అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తూ రాయదుర్గం మండలం కాశీపురం గ్రామానికి చెందిన కావలి తిప్పేస్వామి పట్టుబడినట్లు ఎక్సైజ్ సీఐ మహేష్‌కుమార్, ఎస్ఐలు పవన్‌కుమార్, దామోదర్ తెలిపారు. కొంత కాలంగా తిప్పేస్వామి అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్నట్లుగా సమాచారం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టి నిందితుడిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు వివరించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

'అనంత'లో వరుస హత్యల కలకలం

అనంతపురం: ఒక్క రోజు వ్యవధిలోనే రెండు హత్యలు చోటు చేసుకోవడంతో నగరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. మంగళవారం ఉదయం అనంతపురం నగరంలోని బళ్లారి బైపాస్ రోడ్డులో ఉన్న అన్న క్యాంటీన్ పరిసరాల్లో గార్లదిన్నె మండలం కోటంక గ్రామానికి చెందిన రామలింగ కుమారుడు జి.సిదానంద (28) హత్యకు గురయ్యాడు. ఈ ఘటన మరువక ముందే మంగళవారం రాత్రి కుమ్మర నరసాపురం సురేష్ బాబు(43) దారుణంగా హతమయ్యాడు.

శాంతి భద్రతల వైఫల్యానికి నిదర్శనం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లాలో శాంతి భద్రతలు లోపించాయనేందుకు నిదర్శనంగా ఇప్పటికే పలు హత్యలు చోటు చేసుకున్నాయి. కేవలం 30 రోజులు కూడా గడవక ముందే మూడు హత్యలు చోటు చేసుకుని పోలీసుల వైఫల్యాన్ని ఎత్తి చూపాయి. నగరంలోని రామకృష్ణ కాలనీకి చెందిన గిరిజన యువతి తన్మయి (19)ని అతి కిరాతకంగా హత్య చేశారు. రాష్ట్రంలోనే ఈ ఘటన కలవరపాటుకు గురిచేసింది. ఈ ఘటన మరువక ముందే అనంతపురం నగరంలో ఒక్క రోజు వ్యవధిలోనే మరో రెండు హత్యలు జరిగాయి.



మంగళవారం అనంతపురంలోని బళ్లారి బైపాస్ రోడ్డు వద్ద జరిగిన సిదానంద హత్య స్థలంలో రోదిస్తున్న కుటుంబ సభ్యులు (ఫైల్)

పోలీసులకే సవాల్ విసిరిన గంజాయి బ్యాచ్

అనంతపురం నగరంలో గంజాయి బ్యాచ్ హల్‌చల్ చేస్తోంది. ఏకంగా వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ముందే 'దమ్ముంటే పట్టుకోరా షెకావత్' అంటూ గంజాయి బ్యాచ్ వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడం ద్వారా పోలీసులకు సవాలు విసిరింది. కొన్ని రోజులుగా పుష్ప పాటతో రీల్ చేస్తూ సోషల్ మీడియాలో టాటూ చరణ్ అనే యువకుడు వైరల్ చేశాడు. ఈ నెల 18న అనంతపురంలోని సున్నపుగేరిలో నివాసముంటున్న యశోద ఇంట్లో టాటూ చరణ్, పవన్ చొరబడి డబ్బు కోసం బెదిరించి.. దాడి చేసి దౌర్జన్యంగా సెల్‌ఫోన్ లాక్కెళ్లారు. ఈ క్రమంలో ఈ నెల 21న టాటూ చరణ్, ఇతని అనుచరుడు పవన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిద్దరూ ఇది వరకే దొంగతనం, మనుషులపై దాడి కేసులో నిందితులు.

బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి

- కలెక్టర్‌కు సచివాలయ ఉద్యోగులు, ఎన్జీఓ సంఘం నాయకుల వినతి

అనంతపురం అర్బన్: సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌కు ఎన్జీఓ, సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు విన్నవించారు. రాజకీయ సిఫారసులు, పైరవీలు, అవకతవకలకు తావులేకుండా చూడాలని కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో ఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రమోహన్, కోశాధికారి ప్రవీణ్, తదితరులు కలిసి వినతిపత్రం అందజేసి సమస్య వివరించారు. ఐదేళ్లగా కుటుంబాలకు దూరంగా ఉంటూ ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పట్టించుకోకుండా ప్రజలకు సేవలందించిన సచివాలయ ఉద్యోగులకు బదిలీల్లో అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. నిబంధనల మేరకు సీనియారిటీ జాబితా ప్రకారం బదిలీలు నిర్వహించాలన్నారు. ఖాళీ స్థానాల జాబితాను ముందుగానే ప్రకటించడం తద్వారా అభ్యర్థులు స్థానాలను ఎంపిక చేసుకునే అవకాశం కల్పించాలన్నారు. రేషనలైజేషన్‌లో మిగిలిన వారి అంశంలో ప్రభుత్వం నుంచి స్పష్టత తీసుకోవాలని కోరారు. బదిలీల్లో ఏ ఒక్క ఉద్యోగికి అన్యాయం జరగకుండా అందరికీ న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎన్జీఓ సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి లింగమేష్, సహాయ కార్యదర్శి మహేశ్వరరెడ్డి, సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు షణ్ముఖ, సాయినాథరెడ్డి, అనిల్, రవి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన ఎన్జీఓ సంఘం నాయకులు, సచివాలయ ఉద్యోగులు

కలెక్టరేట్‌లో సంవిధాన్ హత్యాదివస్

అనంతపురం అర్బన్: సంవిధాన్ హత్య దినం మనకు చరిత్రను గుర్తు చేయడమే కాకుండా... భావితరాలకు ఒక బోధనగా నిలుస్తుందని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన సంవిధాన్ హత్య దివస్–2025 కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై భరతమాత చిత్రపటానికి పూలమాల వేసి వందనం సమర్పించారు. ఎమర్జెన్సీపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంవిధాన్ హత్య దినం ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయాల్సిన బాధ్యతను గుర్తు చేస్తుందన్నారు. ఎమర్జెన్సీ సమయంలో ఉద్యమించిన వారికి పెన్షన్ మంజూరు అంశాన్ని రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. ఎమర్జెన్సీ కాలంలో పోరాటాలు సాగించిన జిల్లావాసులు పరుచూరి రమేష్, శ్రీరంగయ్య, సంధ్యావందనం బద్రీనాథ్, జగన్మోహన్‌రావులను కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, జిల్లా పర్యాటక అధికారి జయకుమార్, జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో పలువురికి చోటు

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ విభాగాల్లో పలువురికి చోటు దక్కింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఐటీ వింగ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తలుపూరు ప్రతాపరెడ్డి (శింగనమల), సహాయ కార్యదర్శిగా ఉమ్మడి మనోజ్‌కుమార్‌రెడ్డి (అనంతపురం), ఆర్‌టీఐ వింగ్ కార్యదర్శిగా ఈ.లక్ష్మీకాంతయ్య (అనంతపురం) నియమితులయ్యారు.



తలుపూరు ప్రతాపరెడ్డి, ఐటీ వింగ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ప్రజావ్యతిరేకత దిశగా 'కూటమి'

- నాటి ఎమర్జెన్సీ చీకటి పాలనను తలదన్నేలా నేడు రాష్ట్రంలో పరిస్థితులు
- మతోన్మాద, నిర్బంధ పాలనపై ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాట స్ఫూర్తితో ఉద్యమిద్దాం
- సీపీఎం రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీ పి.మధు

అనంతపురం అర్బన్: ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజావ్యతిరేకతను మూటకట్టుకుందని సీపీఎం సీనియర్ నేత, మాజీ ఎంపీ పి.మధు అన్నారు. ఎమర్జెన్సీకి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అనంతపురం రైల్వేస్టేషన్ నుంచి క్లాక్ టవర్ సమీపంలోని మహాత్మాగాంధీ విగ్రహం వరకు నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నగర కార్యదర్శి రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో మధుతో పాటు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్, జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప మాట్లాడారు. నాటి ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాట స్ఫూర్తితో నేడు మతోన్మాద వ్యతిరేక పోరాటానికి సిద్ధం కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 1975 జూన్ 25వ తేదీ అర్ధరాత్రిన దేశంలో ఎమర్జెన్సీని అప్పటి కేంద్ర ప్రభుత్వం విధించి 1.13 లక్షల మంది ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేయించిందని గుర్తు చేశారు. యాభై ఏళ్ల అనంతరం ఎమర్జెన్సీ చీకటి పాలనను గుర్తు చేసుకుంటే నేడు అంతకంటే ఎక్కువ ప్రమాదకర పరిస్థితి ఉందన్నారు. కార్పొరేట్, మతోన్మాద పాలకుల చేతిలో ప్రజలు నిర్బంధాన్ని చూడాల్సి వస్తోందన్నారు. రాష్ట్రంలో పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. మోదీ ప్రభుత్వానికి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పూర్తిగా లొంగిపోయిందన్నారు. డీసీఎం పవన్‌కల్యాణ్ ద్వారా రాష్ట్రంలో మత రాజకీయాలను బీజేపీ ప్రోత్సహిస్తోందని విమర్శించారు. నిర్బంధ, మతోన్మాద దుష్ట పాలనపై ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటం స్ఫూర్తితో ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. ఐక్య ఉద్యమాల ద్వారానే పేదల సమస్యలకు పరిష్కారం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు జి.ఓబులు, రామరాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు సావిత్రి, జిల్లా నాయకులు బాలరంగయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటనారాయణ, ప్రకాష్‌రెడ్డి, గోపాల్, వలి, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.



అనంతపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

హెచ్ఐవీపై చైతన్యం తీసుకువద్దాం

- ఏపీ ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ నీలకంఠారెడ్డి

అనంతపురం మెడికల్: హెచ్ఐవీ నియంత్రణలో భాగంగా గ్రామీణ ప్రాంతాలు, హెచ్ఐవీ ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఏపీ ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ కె.నీలకంఠారెడ్డి సూచించారు. అనంతపురం, కర్నూలు జిల్లాల్లో హెచ్ఐవీ/ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాల్లో పని చేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రాంతీయ సమీక్షా సమావేశం నగరంలోని ఓ ప్రముఖ హోటల్‌లో బుధవారం జరిగింది. హైరిస్క్ గ్రూపులు, మహిళా సెక్స్ వర్కర్లు, ట్రాన్స్‌జెండర్లు, తదితరులకు అందిస్తున్న సేవలపై పీడీ నీలకంఠారెడ్డి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హైరిస్క్ గ్రూపులతో పాటు వారి భాగస్వామ్యులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. హెచ్ఐవీ సంక్రమించే అవకాశం ఉన్న యువత, ఫ్యాక్టరీ కార్మికులు, ఇతర వర్గాలను గుర్తించి వారికి కూడా హెచ్ఐవీ నిర్ధారణ పరీక్షలు చేపట్టాలన్నారు. ఏపీఎస్ఏసీఎస్ అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ కామేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ... స్వచ్ఛంద సంస్థలు అందించిన సేవల ఆధారంగా ప్రతి స్వచ్ఛంద సంస్థకు గ్రేడింగ్ ఇస్తారన్నారు. దీని ఆధారంగా నిధులు మంజూరవుతాయని పేర్కొన్నారు. ఏపీ సాక్స్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసవర్మ, డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్ సుకుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారులు డాక్టర్ అనుపమజేమ్స్, డాక్టర్ భాస్కర్, డాక్టర్ శారదాబాయి, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్లు వెంకటరత్నం, అలీ హైదర్, రమణ, సిబ్బంది మురళి, నారాయణ స్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ కె.నీలకంఠారెడ్డి

పోక్సో కేసు నమోదు

కుందుర్పి: మండలంలోని జంబుగుంపల గ్రామానికి చెందిన ఓ యువకుడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గత మంగళవారం సాయంత్రం ఓ చిన్నారిపై సదరు యువకుడు అత్యాచార యత్నానికి పాల్పడినట్లు బాధిత చిన్నారి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు బుధవారం పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు వివరించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

రామేశ్వరానికి ప్రత్యేక బస్సు

హిందూపురం: హిందూపురం డిపో నుంచి జూలై 12వ తేదీన రామేశ్వరం యాత్ర స్పెషల్ బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ శ్రీకాంత్ తెలియజేశారు. 12న ఉదయం 7 గంటలకు హిందూపురం నుంచి బస్సు బయలుదేరుతుందన్నారు. కాణిపాకం, వేలూరు గోల్డెన్ టెంపుల్, అరుణాచలం, శ్రీరంగం, మధురై చివరగా రామేశ్వరం దర్శనం తర్వాత 16న ఉదయం తిరిగి హిందూపురం చేరుకుంటుందన్నారు. టికెట్ల కోసం ఫోన్ నంబర్ 9440834715కు సంప్రదించాలన్నారు.

పశు సంవర్ధకశాఖ జేడీ నియామకంపై ఉత్కంఠ

అనంతపురం సెంట్రల్: పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ పోస్టు ఎవరికి వరిస్తుందోనని ఉత్కంఠ ఆ శాఖలో నెలకొంది. ప్రస్తుత జేడీ వెంకటస్వామి ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఇప్పటికే ఇన్‌చార్జ్ జేడీగా పశుగణాభివృద్ధి డీడీ సుధాకర్‌కు బాధ్యతలు అప్పగించారు. అయితే రెగ్యులర్ జేడీ పోస్టును దక్కించుకునేందుకు ఇప్పటికే కొందరు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. ఆ జాబితాలో ప్రస్తుతం ఇన్‌చార్జ్‌గా ఉన్న సుధాకర్, ధర్మవరం డీడీ చంద్రశేఖర్‌తో పాటు రాష్ట్ర డైరెక్టరేట్‌లో పనిచేస్తున్న ప్రేమచంద్ ఉన్నట్లు సమాచారం. త్వరలో డీడీలకు జేడీలుగా పదోన్నతులు కల్పించే అవకాశముంది. ఈ నేపథ్యంలో రెగ్యులర్ జేడీ నియామకంపై ఉత్కంఠ నెలకొంది.

ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని బాలవెంకటాపురం గ్రామానికి చెందిన యువకుడు జిలాన్ బాషా ప్రమాదకరమైన లింఫోమా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. తల్లిదండ్రులు హిమాంబీ, ఫక్రుద్దీన్, భార్య షర్మిలతో కలసి వ్యవసాయంతో జీవనంతో సాగించేవాడు. 2023, నవంబర్‌లో ఆరోగ్యం క్షీణించడంతో అనంతపురంలోని ఆస్పత్రిలో చికిత్స పొందాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి వైద్యుల సూచన మేరకు బెంగళూరుకు కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు.. లింఫోమా క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లుగా నిర్ధారించారు. అప్పటి నుంచి బెంగళూరులోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నాడు. ఇప్పటి వరకూ చికిత్స కోసం దాదాపు రూ.30 లక్షల వరకూ ఖర్చు పెట్టారు. అయినా నయం కాలేదు. ఈ క్రమంలో ప్రస్తుతం చికిత్సకు చేతిలో చిల్లిగవ్వలేక ఇబ్బంది పడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ కోసం స్థానిక టీడీపీ నేతల ద్వారా దరఖాస్తు చేసుకున్నాడు. అయితే వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులంటూ దరఖాస్తును స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు కార్యాలయ సిబ్బంది తిరస్కరించారు. పూర్తిగా క్యాన్సర్ నయం కావాలంటే బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ చేయాలని, ఇందుకు రూ.20 లక్షలకు పైగా అవసరమవుతుందని అక్కడి వైద్యులు తెలిపారని తల్లిదండ్రులు వివరించారు. ఆపన్న హస్తం అందించి తమ కుమారుడికి ప్రాణభిక్ష పెట్టాలని వేడుకుంటున్నారు.



బెంగళూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జిలాన్‌బాషా

ఆర్థిక సాయం చేయదలిస్తే..

పేరు	: జిలాన్‌బాషా
బ్యాంక్	: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, నూతిమడుగు శాఖ
ఖాతా నంబర్	: 9109 362 3576
ఐఎఫ్ఎస్‌సీ కోడ్	: ఏపీజీబీ0001004
ఫోన్ పే నంబర్	:90003 95868

క్లుప్తంగా

సీపీఐ నాయకుడి మృతి



నాగరాజు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని న్యామద్దెల గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు నాగరాజు (53) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు సీపీఐ మండల రైతు సంఘం నాయకుడు ముత్యాలు తెలిపారు. కొన్ని వారాలుగా అనారోగ్యంతో బాధపడుతున్న నాగరాజును కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య పోలేరమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న సీపీఐ రైతు సంఘం నాయకుడు రమణ, మండల నాయకుడు ముత్యాలు, నాయకులు శివమూర్తి, రాము, తిమ్మయ్య, నరసింహులు, రామప్ప, రామగిరి మండల నాయకుడు పోలేపల్లి ముత్యాలు తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నాగరాజు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కూలీల నుంచి ఫిర్యాదులొస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ బి.విజయలక్ష్మి

రాప్తాడు: ఉపాధిహామీ పథకం ద్వారా పనులు కల్పించలేదని కూలీల నుంచి ఫిర్యాదులొస్తే శాఖపరమైన చర్యలు తప్పవని ఎంపీడీఓ బి.విజయలక్ష్మి హెచ్చరించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో పనుల కల్పనపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉపాధి పని కావాలని అడిగిన ప్రతి కూలీకి సిబ్బంది ఉపాధి పనులు కల్పించాలన్నారు. గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి ఉపాధి పనులపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎక్కువ మంది కూలీలు పనులకు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. పనులు కల్పించడంలో ఎవరూ నిర్లక్ష్యం వహించవద్దన్నారు. పని ప్రదేశాల్లో కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సావిత్రి, ఈసీ మురళి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఇద్దరికి గాయాలు



గాయపడిన వ్యక్తులు

ఆత్మకూరు: ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం పంపనూరు సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బెళుగుప్ప మండలం కాలువపల్లికి చెందిన అవినాష్, రాజశేఖర్ ద్విచక్ర వాహనంలో అనంతపురం బయలుదేరారు. పంపనూరు సమీపంలోకి చేరుకోగానే కుక్క అడ్డుగా రావడంతో కిందపడ్డారు. ఈ ప్రమాదంలో అవినాష్ తల, రాజశేఖర్ చేతికి బలమైన గాయాలయ్యాయి. వీరిని హైవే అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

పీడీకి ఘన వీడ్కోలు



పీడీ ఎన్.కేశవమూర్తిని సన్మానిస్తున్న దృశ్యం

రాప్తాడు: ప్రతి ఉద్యోగికి బదిలీ తప్పదు. వారు ఎక్కడా విధులు నిర్వహించినా వారి సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని రాప్తాడు ఉన్నత పాఠశాల హెచ్ఎం రాజేశ్వరి పేర్కొన్నారు. బుధవారం రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8 సంవత్సరాలుగా పీడీగా విధులు నిర్వహిస్తున్న ఎన్.కేశవమూర్తి తాడిపత్రికి బదిలీ అయ్యారు. బదిలీ అయిన పీడీకి పాఠశాల ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎం రాజేశ్వరి మాట్లాడుతూ.. దాదాపుగా 8 సంవత్సరాలుగా ఈ పాఠశాల అభివృద్ధికి విశేష సేవలు అందించిన పీడీ కేశవమూర్తి మరొక పాఠశాలకు వెళ్తుండటం చాలా బాధాకరమన్నారు. పాఠశాలలో విద్యార్థులను క్రమశిక్షణలో పెట్టడం, క్రీడాకారులను తయారు చేయడం పీడీ కేశవమూర్తికే దక్కిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ గంజి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, సర్పంచు సాకే తిరుపాల్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ఆషాఢం వచ్చేనమ్మా..



నేటి నుంచి ప్రారంభం కానున్న సంప్రదాయ మాసం

- వారాహి నవరాత్రులూ కూడా..
- పూజలు, దేవతారాధనకు అత్యంత ప్రాధాన్యత
- మరో నెల రోజుల పాటు ముహూర్తాలు నిల్

అనంతపురం కల్చరల్: అమావాస్య రాకతో జేష్ఠ్య మాసం ముగిసింది. జ్ఞానాన్ని ప్రసాదించే గురువులు, జగన్మాత, విష్ణుమూర్తిని కొలిచేందుకు అనువైన మాసం ఆషాఢం. గురువారం నుంచి అతివలు మెచ్చే ఆషాఢ మాసం ప్రారంభం కానుంది. సహజంగా ఈ మాసంలో అధికంగా సంప్రదాయాలు పాటిస్తారు. చాతుర్మాస దీక్షలు, వారాహి నవరాత్రులు, ఏడు శనివారాల వ్రతాలు, వ్యాస పౌర్ణిమ వంటి వేడుకలతో మాసమంతా వైరాగ్య స్థితికి తెస్తుంది. జూన్ 26 నుంచి జూలై 24 వరకు ఈసారి ఆషాఢ మాసం ఉంటుంది. వచ్చే నెల 10న గురుపౌర్ణిమ మినహా ప్రధాన పండుగలు ఏవీ ఆలయాల్లో జరగనప్పటికీ అమ్మవారి ఆరాధన నెలంతా విశేషంగా జరుగుతుంది. ఇప్పటికే ఆషాఢ మాస పూజలకు ఆలయాల్లో సన్నాహాలు చేస్తున్నారు.

జూలై 10 వరకూ మూఢం

గోరింటాకు పెట్టుకునే సంప్రదాయం ఈ నెలలో అధికంగా కనపడుతుంది. వాతావరణ పరిస్థితులు ఒక్కసారిగా మారే రోజులు కాబట్టి వేడిని తగ్గించి చలువదనం, సహజ అందాన్ని ఇచ్చే గోరింట వేడుకలు నగరంలో మహిళా సంఘాల వారు సామూహికంగా ఏర్పాటు చేస్తున్నారు. సాధారణంగా మాసం మారుతోందంటే జీవన విధానంలో మార్పులొస్తాయి. పండుగలు, వ్రతాలు లేనట్టే. సుముహూర్తాలు కూడా లేనందున వివాహాలపై ఆధారపడిన బాజా భజంత్రీలు, కెమెరామెన్లు, ఫంక్షన్ హాల్స్, పురోహితులు శ్రావణ మాసం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంది. జూలై 10 వరకూ మూఢం నడుస్తుంది. ఆ తర్వాత చిన్నపాటి శుభకార్యాలు చేసుకోవచ్చని పండితులు చెబుతున్నారు.

వారాహి ఆరాధన ప్రత్యేకత



చాలా మంది ఆషాఢ మాసం అనగానే ముహూర్తాల గురించే ఆలోచిస్తారు. సహజంగా పురోహితులకైతే పెద్దగా పని ఉండదు. తర్వాత శ్రావణమంతా సందడిగా ఉంటుంది. అయితే ఆషాఢ మాసంలో అమ్మవారి ఆరాధనతో విశేష ఫలం వస్తుంది. దాన ధర్మాలకు ఈ మాసం శుభప్రదంగా ఉంటుంది. మూఢం తర్వాత చిన్నపాటి శుభకార్యాలు ఆషాఢంలోనూ చేసుకోవచ్చు. ముఖ్యంగా వారాహి నవరాత్రుల పూజలతో మానసికానందం, అనుకున్న కోర్కెలు నెరవేరుతాయని పురాణాలు చెబుతాయి.

– ఉంతకల్లు వంశీకృష్ణ, పురోహితుడు

సహజ గోరింట ఎంతో శ్రేష్టం



ఆషాఢ మాసం అంటే అతివలు అధికంగా ఇష్టపడడానికి ప్రధాన కారణాలు రెండు ఉన్నాయి. సహజ అందం, ఆరోగ్యాన్ని ఇచ్చేది గోరింట. వివిధ రకాల కూరగాయలతో పాటూ గోరింటతో అమ్మవారిని పూజిస్తారు. కాబట్టే ఇదెంతో శ్రేష్టంగా భావిస్తారు. అయితే చర్మాన్ని పాడు చేసే తక్కువస్థాయి కోన్లతో కాకుండా క్వాలిటీవి వాడటం లేదా గోరింటాకులను రుబ్బుకుంటే మంచిది. కొత్తగా పెళ్లయిన ఆడవారు పుట్టింటికి వచ్చే సంప్రదాయం కూడా ఆషాఢంలో ఉన్నందున ఈ మాసమంతా ఆనందంగానే గడిచిపోతుంది.

– సింధుశ్రీ,, బ్రాహ్మణ సంఘం

ఉద్యోగ భద్రత కల్పించాలి



ర్యాలీగా వెళ్తున్న మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం నీటి సరఫరా సిబ్బంది న్యాయపరమైన సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె ఆపేది లేదని ఏపీ మునిసిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు స్పష్టం చేశారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి సప్తగిరి సర్కిల్ మీదుగా అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగ భద్రతతో పాటు ప్రభుత్వ పథకాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి నీటి సరఫరా విభాగంలో పని చేస్తున్నా ప్రభుత్వం తమను గుర్తించకపోవడం దారుణమన్నారు. అనంతరం వారు నగరపాలక సంస్థ ముందు ధర్నా కొనసాగించారు. కార్యక్రమంలో మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు భాస్కర్ రెడ్డి లోకేష్ నాయుడు, నారాయణ స్వామి, పుల్లయ్య, జగదీష్, సృజన, భానుబీ, జగదీష్, రవిశంకర్ రెడ్డి, జగదీష్, కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆశీర్వాద మహోత్సవం



వాక్యోపదేశం చేస్తున్న డాక్టర్ పాల్ ఇమ్మానుయేల్

అనంతపురం కల్చరల్: విశ్వాసంతోనే భగవంతుడిని చేరుకోగలమని బైబిల్ ప్రసంగికుడు డాక్టర్ పాల్ ఇమ్మానుయేల్ అన్నారు. బుధవారం నగరంలోని సప్తగిరి సర్కిల్‌లోని ఎస్‌బియూ చర్చిలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆశీర్వాద మహోత్సవం పేరిట ఆధ్యాత్మిక సమావేశాలు జరిగాయి. విజయవాడ నుంచి విచ్చేసిన అంతర్జాతీయ ప్రసంగికులు రెవరెండ్ ఇమ్మానుయల్, దైవసేవకి నిస్సిపాల్ వాక్యోపదేశం చేశారు. క్రీస్తు బోధనల విశిష్టతను తెలియజేశారు. దేవునిపై అచంచల విశ్వాసంతోనే ఉత్తమ జీవితాన్ని పొందగలమని సూచించారు. ఈ సందర్భంగా బైబిల్‌లోని పలు ఘట్టాలను వివరించిన తీరు ఆకట్టుకుంది. అంతకు ముందు సంఘ కాపరి సంపత్ విజయ్‌కుమార్ సామూహిక ప్రార్థనలు చేయించారు. కోయర్ బృందాల క్రీస్తు భక్తిగీతాలాపనలు అందరినీ అలరించాయి. స్వస్థత కూడికలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో నిర్వాహకులు కేజీ సునీల్‌కుమార్, రాజ్‌కుమార్, విజయ్ కుమార్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనతో మలేరియా నివారణ



ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, వైద్య సిబ్బంది

యాడికి: దోమల నిర్మూలనతో మలేరియాను నివారించవచ్చని తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు అన్నారు. మలేరియా మాసోత్సవం సందర్భంగా బుధవారం కోనుప్పలపాడు ఉన్నత పాఠశాల నుంచి గ్రామ పురవీధుల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ, టైఫాయిడ్ లాంటి వ్యాధులు కలుగజేస్తాయన్నారు. దోములు పెరగకుండా ప్రతి ఒక్కరూ తమ చుట్టు పక్కల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలన్నారు. రాత్రిపూట ప్రతి ఒక్కరూ దోమ తెరలు వాడాలని సూచించారు. ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, హెల్త్ సూపర్‌వైజర్ రాంప్రసాద్‌గౌడ్, ఏఎన్ఎం రాజామణి, హెల్త్ అసిస్టెంట్ మద్దిలేటి, ఆశా కార్యకర్త రాణి పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించండి



భక్తులతో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్

గుంతకల్లు రూరల్: భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని దేవదాయ శాఖ రాయలసీమ జోన్ డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్ ఆలయ సిబ్బందికి సూచించారు. బుధవారం ఆయన కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో పర్యటించి ఆలయ నిర్వహణకు సంబంధించిన అన్ని విషయాలను పరిశీలించారు. ఆలయంలో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు భాగానే ఉన్నప్పటికీ మరింత మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టాలని ఆలయ అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఆలయ ఈఓ కే.వాణి, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

ప్రత్యామ్నాయ టీచర్లను నియమించాలి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఈనెల 30 నాటికి రిటైర్డయ్యే వారి స్థానాల్లో ప్రత్యామ్నాయంగా టీచర్లను నియమించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు కోరారు. బుధవారం స్థానిక సైన్స్ కేంద్రంలో డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ నాయకులు మాట్లాడుతూ.. నగరంలోని అల్లూరి సీతారామరాజు ప్రాథమిక పాఠశాలకు కనీసం ఒక్క టీచర్‌ను కూడా కేటాయించలేదన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో మిగిలిన 11 మంది ఎస్జీటీ తెలుగు, 7 మంది ఎస్జీటీ ఉర్దూ ఉపాధ్యాయులను క్లస్టర్ వెకన్సీల్లో నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. వీరిని అవసరమైన పాఠశాలలకు కేటాయించాలంటే విధి విధానాలు ఇంతవరకు రాలేదన్నారు. కేవలం క్లస్టర్ పరిధిలో అని చూడకుండా ఇతర క్లస్టర్లను కూడా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. కొన్ని క్లస్టర్ పాఠశాలలకు క్లస్టర్ వెన్సీలను కేటాయించలేదన్నారు. ఒక్క ఉపాధ్యాయుడు లేని పాఠశాలకు విద్యార్థుల సంఖ్య మేరకు ఉపాధ్యాయులను కేటాయించ లేదని పేర్కొన్నారు. విద్యార్థుల సంఖ్య 20 కి పైగా ఉన్న సింగిల్ టీచర్ పాఠశాలలకు ఒకరిని కేటాయించాలని సూచించారు. బదిలీ పొందిన చాలా మంది ఉపాధ్యాయులకు ఇంతవరకు పొజిషన్ ఐడీలను కేటాయించలేదన్నారు. ఫలితంగా ఫేషియల్ యాప్‌లో హాజరు వేయడానికి అవకాశం లేదన్నారు. జీతాలు రావడానికి ఆలస్యమవుతోందన్నారు. వీటిపై అధికారులు దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు నీలూరి రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు, రాష్ట్ర మున్సిపల్ ఉపాధ్యాయుల కమిటీ కన్వీనర్ బి.ఫణి భూషణ్, నగర శాఖ ప్రధాన కార్యదర్శి సురేష్, రామన్న పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

బుక్కరాయసముద్రం: కూరగాయల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని డీఏఓ ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. బుధవారం రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి అధ్యక్షతన కూరగాయల సాగులో నారు పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఏఓ మాట్లాడుతూ నారు కొనుగోలు సమయంలో తప్పని సరిగా రసీదులు తీసుకోవాలన్నారు. నాణ్యమైన మొక్కల ఎంపిక చేసుకుంటే మంచి దిగుబడి సాధించవచ్చన్నారు. నారు పెంపకంలో యాజమాన్య పద్ధతులు, చీడ పీడల నివారణపై అవగాహన కల్పించారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ త్రికళ మాధవి, ఉద్యాన వన విశ్వ విద్యాలయం శాస్త్రవేత్త ఉదయ్‌భాస్కర్, సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ కిశోర్, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి, పశు పోషణ శాస్త్రవేత్త డాక్టర్ మాధవి, వ్యవసాయ విస్తరణా శాస్త్రవేత్త డాక్టర్ చందన రైతులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే ఆర్డీటీ లక్ష్యం



మహిళలకు పొదుపు బాండ్లు అందజేస్తున్న డైరెక్టర్ విశా ఫెర్రర్

శెట్టూరు: మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే ఆర్డీటీ లక్ష్యమని సంస్థ మహిళా విభాగం డైరెక్టర్ విశా ఫెర్రర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో అనంతరం ఉజ్వల మహిళ పరస్పర సహాయక సహకార పొదుపు, పరపతి సంఘం లిమిటెడ్ (మహిళ సంఘం బ్యాంక్)ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు బయటి అధిక వడ్డీకి రుణాలు తీసుకొని ఇబ్బంది పడుతున్నారన్నారు. మహిళలు తమ పొదుపును ఉజ్వల మహిళ కోఆపరేటివ్ బ్యాంక్‌లో డిపాజిట్లు చేసి తమకు అవసరం మేరకు అతి తక్కువ వడ్డీకు రుణాలు పొందవచ్చన్నారు. ఉజ్వల మహిళ బ్యాంక్ సిబ్బంది ఇంటి వద్దే సేవలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ నిరంజన్, రీజనల్ డైరెక్టర్ సుబ్బారావు, ఏటీఎల్ సుశీలమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎమ్మెస్ రాయుడు, వైస్ ఎంపీపీ చెవుల కిష్టప్ప, నాయకులు తిప్పేస్వామి, నాయకులు లింగప్ప, కైరేవు శ్రీరాములు, ఈరన్న, బాబురావు, మహిళలు పాల్గొన్నారు.

30న బియ్యం, బేడల వేలం

ఉరవకొండ రూరల్: మండల పరిధిలోని పెన్నహోబిలం నృసింహస్వామి ఆలయానికి భక్తులు సమర్పించిన బియ్యం, బేడలను ఈనెల 30వ తేదీన వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ రమేష్ బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.10 వేలు ధరావత్తు చెల్లించి పాల్గొనాలని సూచించారు.

ముళ్ల చెట్లతో రాకపోకలకు ఇక్కట్లు



సిద్ధరాంపురం వెళ్లే మార్గంలో ఏపుగా పెరిగిన ముళ్ల చెట్లు

ఆత్మకూరు నుంచి సిద్ధరాంపురం గ్రామానికి వెళ్లే మార్గంలో రహదారికి ఇరువైపులా ముళ్ల చెట్లు ఏపుగా పెరిగాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక పోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు. ఎదురుగా వాహనాలు వస్తే ముళ్ల చెట్లలోకి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ప్రయాణికులు చెబుతున్నారు. ద్విచక్ర వాహనాల్లో వెళ్లేటప్పుడు ముళ్ల చెట్లు ముఖానికి తగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు అడ్డంగా ఉన్న ముళ్ల చెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

– ఆత్మకూరు:

ఆటో బోల్తా .. నలుగురికి గాయాలు

పామిడి: ఎద్దులపల్లి వద్ద బుధవారం జరిగిన ఆటో బోల్తా పడిన ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. అనంతపురానికి చెందిన తల్లి, కొడుకు తస్లీమ్, తన్వీర్‌తో పాటు బాషా, బీబీ ఆటోలో ఎల్లార్తికి బయలుదేరారు. ఎద్దులపల్లి వద్ద కుక్క అడ్డురావడంతో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఘటనలో ఆటోలో ఉన్న నలుగురు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

యాచకుడికి తీవ్రగాయాలు

గుత్తి: పట్టణంలోని బాలాజీ లాడ్జి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యాచకుడికి గాయాలయ్యాయి. రోడ్డు దాటుతున్న అతడిని బొలెరో వాహనం ఢీ కొనింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యాచకుడిని స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

జగనన్నతో భేటీ



వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలసిన పీఏసీ సభ్యుడు మహాలక్ష్మి శ్రీనివాస్

అనంతపురం కార్పొరేషన్: తాడేపల్లిలో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు మహాలక్ష్మి శ్రీనివాస్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందించారు.

ఏబీబీఎం ఇన్‌చార్జ్‌ల నియామకం



మాట్లాడుతున్న వక్తలు

అనంతపురం కల్చరల్: బ్రాహ్మణులందరూ ఏకతాటిపైకి వచ్చి ఐక్యతతో అభివృద్ధి సాధించాలని బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ కార్పొరేషన్ మేనేజర్ బిందు, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ రాణువ నరేష్, అనంత కుమారి సూచించారు. బుధవారం ఏబీబీఎం సంఘం (అఖిల భారతీయ బ్రాహ్మణ మహా సంఘ్) కార్యాలయంలో కార్యవర్గ సభ్యుల కమిటీ సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు ఉంతకల్ వంశీకృష్ణ నేతృత్వంలో జరిగిన సమావేశంలో ఏబీబీఎం ఇన్‌చార్జ్‌లను నియమించారు. కార్పొరేషన్ మేనేజర్ బిందు మాట్లాడుతూ.. సంప్రదాయ కార్యక్రమాలతో పాటూ సేవా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. అలాగే బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందాలన్నారు. వివిధ రకాల పథకాల గురించి తెలుసుకోవాలని సూచించారు. అనంతరం సంఘం ఉపాధ్యక్షుడిగా రాఘవేంద్రాచార్, ఆర్థిక సలహాదారులుగా విష్ణుచిత్తన్, సహాయ ప్రధాన కార్యదర్శి యాదవల్లి సుబ్రమణ్యం, ఉరవకొండ ఇన్‌చార్జ్‌గా సతీష్, రాయదుర్గానికి నరసింహమూర్తి, తాడిపత్రికి తేజేశ్వర రావు, గుంతకల్లుకు నవీన్, శింగనమల విష్ణువర్ధన్, కళ్యాణదుర్గానికి ప్రదీప్ శర్మ తదితరులను ఏబీబీఎం ఇన్‌చార్జ్‌లుగా నియమించారు.

ఆకుకూరలతో ఆరోగ్యం



ఆత్మకూరు అంగన్‌వాడీ కేంద్రం వద్ద మునగ మొక్కలు నాటుతున్న దృశ్యం

ఆత్మకూరు: 'గర్భవతులు, బాలింతలు ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి. ఆకుకూరలను ఆహారంగా తీసుకోవడం ద్వారా పౌష్టికాహారం లభిస్తుంది. ఆరోగ్యకరంగా ఉంటారు' అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య, శ్రీవాణి తెలిపారు. బుధవారం మండలంలోని 47 అంగన్‌వాడీ కేంద్రాల్లో మునగ చెట్లు, పాలకూర, తదితర ఆకుకూరల విత్తనాలు నాటారు. ఆకుకూరలు గర్భధారణ సమస్యలు తగ్గిస్తాయని, పిండం అభివృద్ధికి సహాయపడుతాయని పేర్కొన్నారు. అనంతరం గర్భవతులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం నేటికి వాయిదా

చెన్నేకొత్తపల్లి: కోరం లేకపోవడంతో మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ అంజలి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు అధికారులు నిర్ణయించారు. ఉదయం 11 గంటలకు మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, జెడ్పీటీసీ గోవిందరెడ్డి హాజరయ్యారు. అయితే ఒంటి గంట వరకు ఎంపీటీసీలు హాజరు కాలేదు. సమావేశానికి కొద్దిమంది ఎంపీటీసీలు హాజరు కావడంతో కోరం లేక సమావేశాన్ని గురువారానికి వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ బాలక్రిష్ణుడు తెలిపారు. గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి పూర్తిస్థాయిలో ఎంపీటీసీలు, సర్పంచులు తప్పక హాజరు కావాలని సూచించారు. సమావేశం వాయిదా పడటంతో సభ్యులు కార్యాలయం నుంచి వెళ్లిపోయారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీగా నాగచంద్ర



అనంతపురం: మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్, స్పోర్ట్స్ హిందూస్తాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉమ్మడి అనంతపురం జిల్లా సెక్రటరీగా బారీదు నాగచంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీ స్టేట్ చైర్మన్ దయాకర్ ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థుల మనో శారీరక వికాసానికి స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలను విరివిగా నిర్వహిస్తామని నాగచంద్ర పేర్కొన్నారు.